క్లుప్తంగా

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గంగరాజు

గార: పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్‌ఐ సీహెచ్ గంగరాజు అన్నారు. మండలంలోని వమరవల్లి బాలికల గురుకుల పాఠశాలలో నారీశక్తిపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలు సక్రమమైన రీతిలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కి పాల్పడితే వెంటనే సమాచారమివ్వాలన్నారు. సైబర్ క్రైమ్స్‌పై అవగాహన ఉండాలని, టోల్ ఫ్రీ నంబర్ 1093కి సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు రోషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జెమ్స్ డాక్టర్లు

శ్రీకాకుళం రూరల్: ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన అవసరమని జెమ్స్ వైద్య కళాశాల అనస్తీషియా విభాగ వైద్యుడు డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ప్రపంచ మత్తు వైద్యుల దినోత్సవం సందర్భంగా జెమ్స్ వైద్య కళాశాల అనస్తీషియా విభాగం ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణంలోని సన్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కార్డియాక్ అరెస్టు, తక్షణ సాయంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సకాలంలో సీపీఆర్ చేయడం వలన ఒక నిండు ప్రాణాన్ని నిలుపుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జెమ్స్ వైద్య కళాశాల అనస్తీషియా ప్రొఫెసర్లు డా.ప్రదీప్, డా.ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



సూచనలిస్తున్న సీఈఓ సత్యనారాయణ

జి.సిగడాం: గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఇంటింటా చెత్తను సేకరించి చెత్త కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు, సిబ్బంది ఉన్నారు.


వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం: నగరంలోని హయాతీనగర్‌లో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ప్రపంచ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన డిబేట్, వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలవడంతో, ఐసీడీఎస్ పీడీ విమల చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. దీంతో వీరికి ప్రిన్సిపాల్ పి.సంధ్య, ఇతర అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

ముగిసిన పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగిన పారాలీగల్ వాలంటీర్ల శిక్షణ గురువారంతో ముగిసింది. చివరి రోజు వాలంటీర్లకు చట్టాలపై నాయవాదులు మామిడి క్రాంతి, అన్నెపు భువనేశ్వర్‌లు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.స్వర్ణలత మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్‌ను వివరించారు. కార్యక్రమంలో 36 మంది పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

దత్తాత్రేయునికి పూజలు



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలో వేంచేసిన బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో గురువారం దత్తాత్రేయ స్వామివారికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతన్న కుదేలు

- ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా పంట నష్టం
- పరిహారం ప్రకటించని కూటమి సర్కారు
- కోలుకోని స్థితిలో వాణిజ్య పంటల రైతులు



ఇటీవల వీచిన గాలులకు గోసాంలో నేలకొరిగిన అరటి పంట



కృష్ణాపురంలో పడిపోయిన బొప్పాయి పంట

రణస్థలం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు రైతన్నను ఆర్థికంగా కుదేలు చేశాయి. భారీగా వీచిన గాలులతోపాటు వర్షాలు ప్రజల జీవన విధానాలను అస్తవ్యస్తం చేశాయి. ఎచ్చెర్ల నియోజకవర్గం వ్యాప్తంగా వాణిజ్య పంటలు వేసిన రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. అరటి, మొక్కజొన్న, బొప్పాయి, ఉల్లి, టమాటా వంటి పంటలు పూర్తిగా పాడయ్యాయి. తీవ్రమైన గాలులకు వంద ఎకరాల్లో అరటి పంట నేలకొరిగింది. చేతికొచ్చిన మొక్కజొన్న నేలపాలైంది. బొప్పాయి పంట పాడైంది.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లోని వాణిజ్య పంటలు రైతన్నను నిలువునా ముంచేశాయి. రణస్థలం మండలంలోని నారువ, మెంటాడ, గోసాం చిల్లపేటరాజం, కమ్మసిగడాం, అర్జునవలస, వెల్పురాయి, రణస్థలం, నగరప్పాలెం, లావేరు మండలంలోని వేణుగోపాలపురం, తామాడ, లక్ష్మీపురం, రౌతుపేట, కేశవరాయునిపాలెం, లావేరు, గోవిందపురం, ఇచ్చాడపాలెం, జి. సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లోని వందల ఎకరాల్లో అరటి, మొక్కజొన్న, బొప్పాయి నేలకొరిగింది.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం..

అకాల వర్షాలకు రైతులు తీవ్రనష్టాల్లో ఉంటే.. కుటమి ప్రభుత్వం ఇంతవరకు పరిహారం ప్రకటించలేదు. దీంతో రైతన్నలు ఈ ఏడాది భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. మొక్కజొన్నకు మద్దతు ధర ప్రకటించాల్సి ఉన్నా.. కనీసం ఆ దిశగా ప్రయత్నం చేయకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందల ఎకరాల్లో అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలకు నష్టం చేకూరినా అధికారులు స్పష్టమైన నివేదిక తయారు చేయలేదని రైతన్నలు ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారులకు అందజేశాం

ఇటీవల అకాల వర్షాలకు, వీచినగాలులకు లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల్లో అరటి పంట, బొప్పాయి నేలకొరిగాయి. రణస్థలం మండలంలోని అరటి 65 ఎకరాల్లో, బొప్పాయి 40 ఎకరాల్లో, లావేరు మండలంలోని బొప్పాయి 80 ఎకరాల్లో, అరటి 10 ఎకరాల్లో, జి.సిగడాంలో అరటి 2 ఎకరాల్లో నష్టం జరిగినట్లు నివేదిక సిద్ధం చేశాం. ఈ వివరాలన్నీ ఉన్నతాధికారులకు అందజేశాం.

– అమరేశ్వరి, ఉద్యానవన అధికారి, రణస్థలం

ఆహారాన్ని వృథా చేయకండి



శ్రీకాకుళం న్యూకాలనీ: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం అర్బన్: ఆహారాన్ని వృథా చేయవద్దని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డా.పైడి సింధూర అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా నగరంలోని సూర్యమహల్ దగ్గరలో రిక్షా కార్మికులు, దినసరి కూలీలకు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా డా.పైడి సిందూర మాట్లాడుతూ జిల్లా ఎన్విరాన్‌మెంట్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ సహకారంతో నగరంలోని పలుచోట్ల నిస్సహాయులకు ఆహారాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. ఆకలి, పోషకాహార లోపం, ఆహార భద్రతపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. మంచి జీవితం, మంచి భవిష్యత్తు కోసం ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ ఏడాది లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ హంగర్ అంశంలో భాగంగా అన్నవితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉపాధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, ఉర్లం శివతేజ, కార్యదర్శి టిక్కం రామ్‌గోపాల్, సభ్యులు చౌదరి శ్రీనివాస్, రిక్షా యూనియన్ సభ్యుల బృందం పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: శుభకార్యాలు, పండగల సమయంలో ఆహారాన్ని వృథా చేయకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు సూచించారు. ఆహారం లేక అల్లాడిపోతున్న నిరుపేదలు, అభాగ్యులకు అందజేస్తే వారికి ఎంతో బాసటగా ఉంటుందన్నారు. జీసీడీ ఉమెన్ కళాశాలలో ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం 'ప్రపంచ ఆహార దినోత్సవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యచంద్ర మాట్లాడుతూ ఆకలి గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చించడం, దాని నిర్మూలన, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించే చర్యలను ప్రోత్సహించడం వంటివి ఆహార దినోత్సవం ముఖ్య లక్ష్యమన్నారు. ఆర్థికశాస్త్ర విభాగాధిపతి టి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి స్థిరమైన ఆహార భవిష్యత్తు కోసం అవగాహన కల్పించడానికి ఆహార దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చిన్నారావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, అకాడమిక్ కో–ఆర్డినేటర్ కె.మౌనిక, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గుర్తింపు కార్డుల వితరణ



గుర్తింపు కార్డులను చూపుతున్న విద్యార్థులు

రణస్థలం: కౌమార దశలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల పట్ల విద్యార్థినులకు అవగాహన ఉండాలని స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక అన్నారు. తన తండ్రి ప్రస్తుత తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు చదువుకున్న లావేరు ఉన్నత పాఠశాలలో 275 మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులను ఆమె వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రతి నెలా ఎదురయ్యే రుతు సంబంధమైన సమస్యలపై అవగాహన ఉండాలన్నారు.

విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. డాక్టర్ ప్రియాంకను హెచ్‌ఎం పసుపుల జగన్నాథం అభినందించారు. మాజీ జెడ్పీటీసీ నిడిగంట త్రినాథరావు, ఎచ్చెర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిడిగంటల పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

రణస్థలం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కమిటీ ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాల్లోని మహిళా విభాగం కమిటీలను నియమించింది. ఎచ్చెర్ల మండల మహిళ విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా వడియారపు మాధురీలత, వైస్ ప్రెసిడెంట్‌లుగా సీపాన ధనలక్ష్మి, జి.భార్గవి, జనరల్ సెక్రటరీలుగా కుటికుప్పల అనంతలక్ష్మి, వి.అశ్వని, అల్లు జ్యోతి, సెక్రటరీలుగా దుంప సీతారత్నం, జె.వరలక్ష్మి, ఆర్.జ్యోతి, పొన్నాడ ఉమాదేవి, యాళ్ల వరలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి.సాయి లక్ష్మి, రుప్ప పుష్పలత, ముక్కల అరుణ, దుంప ఈశ్వరమ్మ, గొలివి పూర్ణ, పంగ ఇందిరమ్మ, వావిలపల్లి సుధాను నియమించారు.

జి.సిగడాం మండలంలో..

జి.సిగడాం మండలంలోని మహిళా విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా కుమరాపు కుమారి, వైస్ ప్రెసిడెంట్లుగా బాలబొమ్మ రాంబాయమ్మ, మక్క శ్రీలత, జనరల్ సెక్రటరీలుగా కుదిరెళ్ల సుజాత, పట్నాన శాంతి, బాటు శ్రీదేవి, సెక్రటరీలుగా పరసురాపు మంగమ్మ, మామిడి ధనలక్ష్మి, వడిశ జయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చందక శారద, తిరుమరెడ్డి విజయలక్ష్మి, రెడ్డి భాగ్యలక్ష్మి, చిత్రి మంజూ, పున్నాన సోనియా, రాయపురెడ్డి శాంతమ్మ, కొబగాన రాజేశ్వరిని నియమించారు.

డీజే పరికరాలు చోరీ

రణస్థలం: లావేరు మండలంలోని పోతయ్యవలస గ్రామానికి చెందిన కొంపెల్లి హరికృష్ణకు చెందిన డీజే సౌండ్ సిస్టమ్‌కు చెందిన పరికరాలు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఈ నెల 9వ తేదీన దొంగతనానికి పాల్పడ్డారు. దీనిపై బాధితుడు గురువారం లావేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ ఎం.రాజారావు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన కొన్నావీధి వాస్తవ్యులు పెంటయ్య, అన్నపూర్ణ దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు విరాళ చెక్కును గురువారం దాతలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని బలగమెట్టులో నివసిస్తున్న బి.నాగరాజు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.50 వేలు విలువైన బాణసంచా స్వాధీనం చేసుకున్నామని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు గురువారం తెలిపారు. అలాగే డే అండ్ నైట్ సమీపంలో నివాసముంటున్న పూడి ధనలక్ష్మి తన స్థలంలో గోడ నిర్మాణం చేపట్టారు. అయితే సమీపంలోనే ఉన్న ఆటో యూనియన్ సభ్యులు గోడను కూలదోయడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..!



తండేవలసకు వెళ్లే మార్గంలో ఉన్న భవనాలు

- అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు
- పట్టించుకోని అధికారులు



నిర్మాణం పూర్తవ్వని గ్రామ సచివాలయ భవనం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని తండేవలస గ్రామానికి వెళ్లే రహదారిలో పెదపాడు-1కు చెందిన ప్రభుత్వ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గత ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో ఈ భవనాలను నిర్మించగా.. ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం మానేశారు. దీంతో ఇక్కడ పోకిరీలు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, సచివాలయం భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. ఇదే ప్రాంతంలో కొంతమందికి ఇళ్ల పట్టాలను సైతం అధికారులు మంజూరు చేశారు. ప్రస్తుతం పెదపాడులో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం చాలా చిన్న భవనంగా ఉండడంతో అందులో పనిచేస్తున్నవారు అపసోపాలు పడుతున్నారు. అందువలన ఇప్పటికైనా ఈ భవన నిర్మాణాలను పూర్తిచేసి, ప్రభుత్వ శాఖలకు ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

మా గ్రామ శివారున మూడు ప్రభుత్వ భవనాలు నిర్మించారు. వాటిని మధ్యలోనే ఆపేసారు. వాటిని నిర్మిస్తే చాలా బాగుంటుంది. వివిధ పనులు, పెన్షన్ల కోసం పెదపాడు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వస్తే నిల్చోని ఉండాల్సిన పరిస్థితి ఉంది. అందువలన అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తిచేస్తే మాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– ఆర్.గన్నయ్య, పెదపాడు గ్రామస్తుడు

కూటమి కుట్రలను తిప్పికొట్టాలి



జాడలో కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రవేటీకరణ చేసి పేదలకు వైద్యం, విద్య అందకుండా చేయాలన్న సీఎం చంద్రబాబు కుతంత్రాలను అడ్డుకోవాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని వెంకయ్యపేట, జగన్నాథవలస, జాడ, ముషినివలస, డి.ఆర్.వలస గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు డోల వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండి ప్రజలపక్షాన పోరాటాలు చేయాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్, జిల్లా మహిళా కార్యదర్శి వాన ప్రమీల, మండల మహిళా అధ్యక్షురాలు కుమరాపు కుమారి, యూత్ కన్వీనర్ గేదెల నారాయణరావు, ఎస్సీ సెల్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి లోపింటి జీవన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాసరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కారు నాగరాజు, సర్పంచ్‌లు, నాయకులు కుమరాపు శ్రీనివాసరావు, మావిడి శ్రీనివాసరావు, చందక సతీష్, కుమరాపు సన్యాసిఅప్పలనాయుడు, అల్లబోయిన సత్యనారాయణ, చందక మహేశ్వరావు, అలజింగి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జీఎస్టీ ఉత్సవ్‌లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు గురువారం నిర్వహించారు. దీనిలో తన్మయ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నృత్య దర్శకురాలు తన్మయ బృందంచే ప్రదర్శించిన కూచిపూడి శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు



కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహిస్తున్న అధికారులు

టెక్కలి: ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని 14వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ శశాంక్ కుశ్వహ అన్నారు. మండలంలోని పాతనౌపడ సమీపంలో ఉన్న ప్రణవి కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఎన్‌సీసీలో చేరాలనే ఆసక్తి అధికంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించి తద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ బల్వంత్‌సింగ్, జితేంద్రకుమార్, వి.శ్రీరామ్మూర్తి, రవికృష్ణ, జీసీఐ కె.త్రిశాలి, కళాశాల డైరెక్టర్ పి.చంద్రశేఖర్ ఆజాద్, ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారావు, ఎన్‌సీసీ అధికారి బి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఏపీఎస్టీఏ ప్రధాన కార్యదర్శి చందనరావు

నందిగాం: పూర్తిగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పలు పాఠశాలలను గురువారం సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జయపురం పాఠశాలలో మాట్లాడుతూ.. పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వ, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని విస్మరించడం తగదన్నారు. అనంతరం ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొడ్డేపల్లి రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ కేకే రామిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై స్పష్టత ఉండాలి



మాట్లాడుతున్న ఆర్‌వో పద్మావతి

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి గ్రామాల్లో ఓటరు పేరు నమోదు చేసే సమయాల్లో సంబంధిత బీఎల్‌వోకు అవగాహన, స్పష్టత ఉండాలని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.పద్మావతి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, కవిటి, కంచిలి, సోంపేట మండలాలకు చెందిన 299 మంది బీఎల్‌వోలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆధార్‌కు ఓటరు కార్డును అనుసంధానం చేయాలని, గ్రామంలో ఆరు నెలలు నివాసం ఉంటేనే ఓటరు కార్డును మంజూరు చేయాలని సూచించారు. బీఎల్‌వోల యాప్‌లో ఫారం–6 ఓటరు చేర్పులు, ఫారం–7 తొలగింపులు, ఫారం–8 మార్పులు గురించి వివరించారు. ఇతరుల ప్రలోభాలకు లొంగి కార్డు తొలగింపులు, నివాసం మార్పులు చేయరాదన్నారు. ప్రతీ ఒక్క బీఎల్‌వో వద్ద 2002 నాటి ఓటరు జాబితా డేటా అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి మండల తహసీల్దార్లు ఎస్.వెంకటరావు, మురళీమోహనరావు బెహరా, బి.అప్పలస్వామి, ఎస్.రమేష్, ఎన్నికల ఉప తహసీల్దార్ బి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

హిరమండలం: గ్రామాల్లో 104 వాహనం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని, వాహనాల నిర్వహణ చూస్తున్న భవ్య ఏజెన్సీ డివిజనల్ అధికారి దినేష్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని 104 వాహనాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమయ్యారు. వాహనం ద్వారా అందించిన సేవలు గురించి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు.